క్లుప్తంగా

ప్రొజెక్టర్ బహూకరణ



కేయూ క్యాంపస్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023 – 2025వ విద్యా సంవత్సరానికి చెందిన ఎమ్మెస్సీ బాటనీ విద్యార్థులు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని బాటనీ విభాగానికి ప్రొజెక్టర్‌ను మంగళవారం బహూకరించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతికి విద్యార్థి కొట్టె తిరుపతి ప్రొజెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, విభాగం అధిపతి డాక్టర్ శ్రీధర్‌రావు, డాక్టర్ కరుణాకర్‌రావు, డాక్టర్ కొమురయ్య, డాక్టర్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌ఎస్‌లో వాలీబాల్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వెటరన్ వాలీబాల్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ హాజరై టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విజేతలకు ఈనెల 29న జరగనున్న ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

కాజీపేటలో కుక్కల పట్టివేత



కాజీపేట: వామ్మో కుక్కలు! అంటూ సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు కాజీపేట పట్టణంలోని పలు కుక్కలను మున్సిపల్ సిబ్బంది మంగళవారం బంధించారు. స్థానిక కార్పొరేటర్ విజయశ్రీరజాలీ పర్యవేక్షణలో 63వ డివిజన్‌లో కుక్కలను పట్టుకుని ప్రత్యేక వాహనంలో ఇతర ప్రాంతాలకు తరలించారు.

సీపీఐ నేతకు సన్మానం



ఖిలా వరంగల్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావును శివనగర్ సీపీఐ తమ్మెర భవనంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాషుమియాతో పాటు నాయకులు మంగళవారం సన్మానించారు. మేడ్చల్ జిల్లాలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్, గుండె బద్రి, ల్యాదెల్ల శరత్, ఓర్సు రాజు, అక్బర్, జన్ను రవి, పరికిరాల రమేశ్, లావుడ్యా దస్రూ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి



కాజీపేట: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని, ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి సూచించారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడి తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో మడికొండ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ర్యాంగింగ్ వ్యతిరేక సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ కేసుల్లో ఇరుక్కుంటే జీవితమే ఆగమైపోతుందని హెచ్చరించారు. సదస్సులో ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సప్తగిరి కాలనీలో చోరీ



హసన్‌పర్తి: గ్రేటర్ 56వ డివిజన్ సప్తగిరి కాలనీలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి వెంకట్‌రెడ్డి దంపతులు నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లి మంగళవారం ఇంటికి రాగా.. తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళాలు ధ్వంసం చేసి బట్టలు చిందరవందరంగా పడి ఉండడాన్ని గమనించారు. అందులో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.10 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జాగిలాలతో గాలించారు. వేలిముద్రలు సేకరించారు.

‘చవితి’ వేలం.. పెరిగిన ధరలు

- భగ్గుమన్న కూరగాయలు, ఆకుకూరల రేట్లు
- ఆందోళన వ్యక్తం చేసిన వినియోగదారులు
- మార్కెట్ అధికారుల ఆదేశాలు లెక్కచేయని కమీషన్ ఏజెంట్లు



వరంగల్ అర్బన్: వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో మంగళవారం కూరగాయలు, ఆకుకూరల ధరలు భగ్గుమన్నాయి. వినాయక చవితి పేరుతో మార్కెట్ నిబంధనలను అతిక్రమించి కమీషన్ ఏజెంట్లు వేలంపాట నిర్వహించడంతో ఒక్క రోజు తేడాతో ధరలు రెట్టింపు కాగా, సామాన్యులు ఉక్కిరిబిక్కిరికి గురయ్యారు. వేలంపాట నిర్వహించొద్దని, ఒకవేళ ఎవరైనా పాల్గొంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జీ.రెడ్డి హెచ్చరించినా కమీషన్ ఏజెంట్లు ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ నెల 24న వేలంపాటలో ఖరారైన విధంగా కొంతమంది మాత్రమే కూరగాయలు, ఆకుకూరల క్రయ, విక్రయాలను నిర్వహించి, ధరలను ఇష్టారాజ్యంగా పెంచేశారు. దీంతో పర్వదినం పేరిట ఇవేమి ధరలు బాబోయ్.. అంటూ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా మార్కెట్ అధికారులు ఉలుకుపలుకు లేకుండా ప్రేక్షకపాత్ర పోషించారు.

అమాంతం పెరిగిన ధరలు

పచ్చిమిర్చి సోమవారం రూ.45 పలకగా, మంగళవారం రూ.60లకు విక్రయించారు. టమాటా రూ.55 ఉండగా, రూ.80, చిక్కుడు రూ.45 నుంచి రూ.80, గోరు చిక్కుడు రూ.35 నుంచి రూ.60, క్యాబేజీ రూ.25 ఉండగా రూ.40 పలికింది. కంద రూ.55 నుంచి రూ.60, బెండకాయ రూ.30 – రూ.60, కాకరకాయ రూ.35 ఉండగా రూ.60, ఫ్లవర్ రూ.45 నుంచి రూ.80, వంకాయ రూ.35 – రూ. 60, క్యారెట్ రూ.50 కాగా రూ. 80లకు విక్రయించారు. బీన్నీస్ రూ.110 నుంచి రూ.220లకు, ఆలుగడ్డ రూ.30 కాగా రూ.50లకు, బీరకాయ రూ.45 ఉండగా రూ.80, దోసకాయ రూ.45 కాగా రూ.60, దొండకాయ రూ.35 కాగా రూ.60కి విక్రయించారు. అయితే, మార్కెట్ అధికారులు మాత్రం స్వల్ప ధరలు పెంచి ధరల పట్టికను ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. నిబంధనలు అమలు చేయాలని ఆదేశించిన అధికారులు.. చివరికి కమీషన్ ఏజెంట్ల ఒత్తిళ్లకు తలొగ్గి కూరగాయలు, ఆకుకూరల ధరలను అదుపు చేయలేకపోయారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

మదర్‌థెరిస్సాకు ఘన నివాళి



కాజీపేటలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు



మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట: సామాజిక సేవకురాలు మదర్ థెరిస్సా 115వ జయంతి వేడుకలను ఫాతిమానగర్‌లో క్రైస్తవులు మంగళవారం జరుపుకున్నారు. కెథడ్రల్ చర్చి ఆవరణలో కథోలికులు ప్రత్యేక ప్రార్థనలు చేసి పురవీధుల మీదుగా మదర్‌థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఫాతిమానగర్ – కేయూ 100 ఫీట్‌రోడ్డులో మదర్‌థెరిస్సా విగ్రహానికి కెథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెథడ్రల్ చర్చి విచారణ కమిటీ సభ్యులు ఆర్.రాజ్‌మోహన్ రావు, టీడీ టామి, బొక్క దయాసాగర్, అల్లం ప్రకాష్ రెడ్డి, మత్యాస్ రెడ్డి, జ్ఞానప్రకాష్, సుధాకర్ రెడ్డి, కమ్ముల ప్రతాప్, బి.ప్రభాకర్, సిస్టర్లు, ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

హన్మకొండ చౌరస్తా: మదర్ థెరిస్సా జయంతిని హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా చిత్రపటానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి



రాష్ట్రస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కోగిల మహేష్

- దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్

హన్మకొండ: దళిత బంధు, చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని వదలిపెట్టబోమని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్ అన్నారు. హనుమకొండ ఎన్జీఓస్ కాలనీలోని ఫంక్షన్ హాల్‌లో దళిత బంధు సాధన సమితి రాష్ట్ర స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎన్నికల హామీలు అమలు చేయకుండా దళితులను ప్రభుత్వం వంచిస్తోందని ఆరోపించారు. 18 నెలలుగా దళిత బంధు నిధుల విడుదలకు పోరాటం చేస్తుంటే స్పందించడం లేదన్నారు. అనంతరం దళిత బంధు ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్లుగా ఇమ్మడి రాజు, బైరపాక ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు మడికొండ రమేష్, భువనగిరి శ్రీనివాస్, దర్శనాల సంజీవ, చిట్టిమల్ల సమ్మయ్య, బోనగిరి శ్రీనివాస్, దర్శనాల సంజీవ, కావేరి చిన్నికృష్ణ, దివిటి బాలనర్సు, దుర్గం రాజేష్, మంత్రి రాజాబాబు, అధ్యక్షురాలు అక్కినపల్లి జయ, గద్దెల శంకర్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

హసన్‌పర్తి: డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జెన్‌పాక్ట్ సీనియర్ మేనేజర్ గౌరి మహేంద్ర అన్నారు. సిటీ మహిళా డిగ్రీ కళాశాల, శివానీ డిగ్రీ కళాశాలతో ఏఐఎస్‌ఈసీటీ సంస్థ ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా గౌరి మహేందర్ మాట్లాడుతూ ఫైనాన్స్ అకౌంటింగ్, బ్యాంకింగ్ అండ్ సాఫ్ట్‌వేర్ స్కిల్స్ శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు తెలిపారు. ఏఐఎస్‌ఈసీటీ సంస్థ రెండు దశాబ్దాలుగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో డిజిటల్ లిటరసీ, నైపుణ్యాభివృద్ధి, విద్య, ఉపాధి, రంగాల్లో పనిచేస్తూ ఇప్పటివరకు ఆరు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఈసీటీ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ విపుల్ శర్మ, శివానీ డిగ్రీ కళాశాల డైరెక్టర్ సురేష్, సిటీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అమరజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న చైర్మన్ బన్న సుధాకర్, ఎండీ శ్రీరామోజు గిరిబాబు

హన్మకొండ: పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని రామమ్ చిట్ ఫండ్స్ చైర్మన్ బన్న సుధాకర్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరామోజు గిరిబాబు సూచించారు. హనుమకొండలోని కాళోజీ కూడలిలో రామమ్ చిట్ ఫండ్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో నీరు, భూమి కలుషితమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి విగ్రహాలే అన్ని విధాలుగా శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సునీల్, రాజ్‌కుమార్, రవికుమార్, యాదగిరి, రమేష్, వినోద్, శ్రీనివాస్, శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దు



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

- సైబర్ క్రైమ్ ఏసీపీ గిరికుమార్

వరంగల్ చౌరస్తా: విద్యార్థులు సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దని, చదువుపై దృష్టి కేంద్రకరించాలని సైబర్ క్రైమ్ ఏసీపీ గిరికుమార్ సూచించారు. వరంగల్ కృష్ణాకాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాగృతి పోలీస్ కళాశాల బృందం ఆధ్వర్యంలో కళాజాత గేయాలను మంగళవారం ఆలపించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో డయల్ 100 నంబర్‌కు కాల్ చేయాలని, సైబర్ మోసాలకు గురైతే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షూకూర్, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ ఎస్సై చరణ్, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

‘భద్రకాళి’లో చిందు యక్షగానం



దేవాలయంలో యక్షగాన కళాకారులు

హన్మకొండ కల్చరల్: భక్తుల కాలక్షేపం కోసం భద్రకాళి దేవాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గడ్డం సుదర్శన్ బృందం గరుడాచల నాటకం ‘చెంచులక్ష్మి’ చిందు యక్షగానాన్ని మంగళవారం ప్రదర్శించారు. అలాగే, అమ్మవారిని ఎంపీ బలరాం నాయక్ దర్శించుకుని పూజలు చేశారు. మట్టితో చేసిన గణపతి ప్రతిమలను భక్తులకు ఆలయ ఈఓ రామల సునీత అందజేశారు.

‘కేయూ ఇంజనీరింగ్’లో ఓరియంటేషన్



అనితారెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని అన్నారు. సైబర్ క్రైమ్ విభాగం ఏసీపీ గిరికుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాలకమండలి సభ్యురాలు అనితారెడ్డి, ఏసీపీ గిరికుమార్‌ను ఘనంగా సన్మానించారు.

రేపు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో..

ఈనెల 28న కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు యూనివర్సిటీలోని సెనెట్ హాల్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ సదానందం పాల్గొంటారని పేర్కొన్నారు.

తపాలా బీమా చెక్కు అందజేత

ఖిలా వరంగల్: తపాలా శాఖలో లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్న సోమ వసుధ(28) ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందింది. ఈ మేరకు పోస్టల్ బీమా నుంచి మంజూరైన రూ.11,23,490 విలువైన చెక్కును మృతురాలి తల్లి సోమ పద్మావతికి తపాలా శాఖ వరంగల్ డివిజనల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో యశోద, గోవర్ధన్, వాసం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.









సంక్షిప్తంగా

కూచిపూడి నృత్య కళాకారులకు సన్మానం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన నృత్య కళాకారులను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ సన్మానించారు. తపస్వి డాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు, సినిమా నృత్య దర్శకురాలు సీతారత్నం శిష్య బృందం ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాజదర్బారు సేవలో కళాకారులకు ఆలయ పాలక మండలి సభ్యులు ప్రశంసపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ వ్యాఖ్యాత శనిగరపు రాజ్‌మోహన్, ఆలయ ఇన్‌చార్జ్ తుమ్మ శ్రీనివాస్, దేవులపల్లి సదానందం, కె.భాస్కర్ రావు, సీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మహేశ్వరం గౌరీశంకర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, గౌరీశంకర్ ప్రస్తుతం హనుమకొండ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అలాగే, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు వెంకన్నను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మత్స్యకారులకు అవకాశం ఇవ్వాలి

న్యూశాయంపేట: హనుమకొండ పాత బస్‌డిపో వద్ద ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో స్థానికంగా చేపలు అమ్ముకుంటున్న మత్స్యకారులకు అవకాశం కల్పించాలని తెలంగాణ మత్స్య కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజేందర్, మమత, వనమాల, రజిత, పద్మ, స్వరూప, స్వాతి, నాగరాజు, వనమ్మ, ధనలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కారు – బస్సు ఢీ.. స్తంభించిన ట్రాఫిక్

కాజీపేట: కాజీపేట పట్టణంలోని బాపూజీనగర్ ప్రధాన రహదారిపై మంగళవారం ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు అదుపు తప్పి కారును ఢీకొన్న ఘటనలో కారు ధ్వంసంకాగా, కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. కడిపికొండలోని కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయుడు వెంకన్న.. విధి నిర్వహణ కోసం వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కళాశాల బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో కారు రహదారిపై నుంచి పక్కకు కదలకపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకుని కారును పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్‌షాపులపై చర్య తీసుకోవాలి

కాజీపేట అర్బన్: బెల్ట్‌షాపు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అవినీతి నిర్మూలన సంస్థ వ్యవస్థాపకుడు పుల్లూరి కుమారస్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ సుద్దాల అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు కాజీపేట నిట్ సమీపంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బెల్ట్‌షాపులకు మందు సరఫరా చేస్తున్న వైన్స్‌పై కూడా చర్య తీసుకోవాలని పేర్కొన్నారు.

యూజీసీ ముసాయిదా పత్రాల దహనం

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన పాఠ్య ప్రణాళిక ముసాయిదా అశాస్త్రీయమైనదని, దాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముసాయిదా పత్రాలను మంగళవారం దహనం చేశారు. నిరసన కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కేయూ కమిటీ బాధ్యులు ప్రశాంత్, నవీన్, ఓంప్రకాశ్, రాహుల్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు హసన్‌పర్తి మండలం పెంబర్తిలోని ఇండియన్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ పోటీల్లో ఇండియన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ట్రెడిషనల్ విభాగంలో రిత్విక్ బంగారు పతకం, గణేష్ రజత పతకం సాధించాడు. అలాగే, ట్విస్టింగ్ విభాగంలో గణేష్ వర్మ, లెగ్ బ్యాలెన్స్‌లో అశ్వంత్ తేజ్ బంగారు పతకాలు అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక తెలిపారు. వచ్చేనెల 5నుంచి 7వ తేదీ వరకు నిర్మల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. కాగా, పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు కరస్పాండెంట్ అజ్మీర రమేష్, ఏఓ బండా కార్తీక్, ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, యోగా మాస్టర్ చెన్నూరి జీవన్, ఉపాధ్యాయులు అభినందించారు.

యోగాలో ‘న్యూకొటిల్యాస్’కు రజత పతకాలు

ఖిలా వరంగల్: హనుమకొండ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో వరంగల్ కరీమాబాద్‌లోని న్యూ కొటిల్యాస్ సెయింట్ ఆమెన్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని రజత పతకాలు సాధించారు. అండర్ –18 బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థిని టి.వైష్ణవి జిల్లా ద్వితీయ, బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థి జి.పవన్‌కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాలను కైవసం చేసుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ కోడం శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ప్రాంగణంలో వారిని కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ కోడం సబిత, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

రైల్వే ఉద్యోగుల గెట్ టు గెదర్ వేడుకలు

మడికొండ: 2005 – 2025 వరకు పనిచేసి రిటైర్డ్ అయిన రైల్వే ఉద్యోగులు గెట్ టు గెదర్ వేడుకలను మడికొండలో మంగళవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీటీఐ మారపాక కట్టస్వామి, గంప సాంబమూర్తి, మధు, రాజారాం, కుమారస్వామి, సంజీవయ్య పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో కాలనీ బోర్డు ఏర్పాటు

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట బస్టాండ్ సమీపంలో వెలసిన నూతన కాలనీ నేమ్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈమేరకు జై హనుమాన్ స్ట్రీట్‌గా మంగళవారం కార్పొరేటర్ మామిండ్ల రాజు నామకరణం చేశారు. కాలనీవాసులు కొల్లూరి కోటేశ్వర్, అశోక్, చేరాలు, శ్రీనివాస్, రాజేష్, గోపి పాల్గొన్నారు.